క్లుప్తంగా

ఖోఖో విజేతలకు అభినందన


క్రీడాకారులతో సీఐ ప్రవీణ్‌కుమార్

కోరుట్ల రూరల్: పట్టణానికి చెందిన ఖోఖో క్రీడాకారులు (బాలురు) అండర్–14, అండర్–17 విభాగాల్లో జిల్లాస్థాయి పోటీల్లో మొదటి స్థానం సాధించారు. వీరిని కోరుట్ల సీఐ ప్రవీణ్‌కుమార్ సోమవారం సన్మానించి అభినందించారు. ఇదే స్ఫూర్తిని కొనసాగించాలని సూచించారు. అలాగే పట్టణానికి చెందిన పాటి హరీశ్, చిట్యాల సాయికుమార్, ఎడ్ల ప్రణయ్, వంచ సతీశ్ కానిస్టేబుల్ ఉద్యోగానికి ఎంపిక కాగా వారిని సత్కరించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ జిందం లక్ష్మీనారాయణ, పెండెం గణేశ్, పీఈటీలు వెంకట్‌రెడ్డి, గంగాధర్, లక్ష్మీనారాయణ, రవి, రాజు, సాగర్ పాల్గొన్నారు.

కొడిమ్యాల తహసీల్దార్‌గా రవికాంత్


పుష్పగుచ్ఛం అందజేస్తున్న సిబ్బంది

కొండగట్టు: కొడిమ్యాల మండల తహసీల్దార్‌గా రవికాంత్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వహించిన నరేశ్ బీర్‌పూర్‌కు బదిలీపై వెళ్లారు. నూతన తహసీల్దార్‌కు డీటీ కృష్ణ, ఆర్‌ఐ, సిబ్బంది పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు.

బాధ్యతలు స్వీకరించిన ఎస్సై


శ్యామ్‌రాజ్

మేడిపెల్లి: మేడిపల్లి పోలీస్ స్టేషన్ ఎస్సైగా శ్యామ్‌రాజ్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన ఎస్సై చిరంజీవి మెట్‌పల్లికి బదిలీ అయ్యారు.

బస్‌స్టాప్ ప్రారంభం


ప్రారంభిస్తున్న ఎంపీపీ, సర్పంచ్, దాత శేఖర్

మల్యాల: మండల కేంద్రంలోని కొత్తపేటలో నూతనంగా నిర్మించిన బస్‌స్టాప్‌ను సోమవారం ఎంపీపీ మిట్టపల్లి విమల, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు మిట్టపల్లి సుదర్శన్, బస్‌స్టాప్ నిర్మాణం కోసం రూ.3లక్షలు విరాళం ఇచ్చిన దొంతరవేని శేఖర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామాభివృద్ధికి చేయూతనందించిన శేఖర్‌ను సర్పంచ్ అభినందించారు.

సకాలంలో చెల్లించండి


విద్యుత్ బిల్లులు వసూలు చేస్తున్న అధికారులు


ఇబ్రహీంపట్నం: సకాలంలో విద్యుత్ బిల్లులు చెల్లించి సహకరించాలని సీనియర్ లైన్ ఇన్‌స్పెక్టర్ సంబమూర్తి అన్నారు. సోమవారం మండలంలోని వేములకుర్తిలో స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. లైన్ మెన్లు కొలిపాక రాజు, తంగళ్లపెల్లి శ్యామ్, రాము, జూనియర్ లైన్‌మెన్లు శ్రీధర్, చింతకింది రవి, నూనే శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

కాన్షీరాం వర్ధంతి


నివాళి అర్పిస్తున్న నాయకులు

మెట్‌పల్లి: బీఎస్పీ వ్యవస్థాపక అధ్యక్షుడు మాన్యవార్ కాన్షీరాం 17వ వర్ధంతిని సోమవారం మెట్‌పల్లి పట్టణంలో బీఎస్పీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహం వద్ద కాన్షీరాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. దేశంలో విప్లవాత్మక మార్పును తెచ్చి బడుగు బలహీన వర్గాలకు ఎంతో మేలు చేసిన వ్యక్తి అని గుర్తుచేశారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు అమర్, ప్రభాకర్, లక్ష్మణ్, రఘు, బాలరాజ్, లక్ష్మీనర్సయ్య, ప్రణయ్ పాల్గొన్నారు.

సన్మానం



ధర్మపురి: ఒకే గ్రామం, ఒకే పాఠశాలలో చదివి ప్రభుత్వ కొలువులో స్థిరపడిన ఉద్యోగులను సోమవారం పాఠశాల యాజమాన్యం ఘనంగా సన్మానించింది. మండలంలోని నేరెల్ల ఆదర్శ పాఠశాలలో చదివిన సుమారు 14 మంది ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారు. కరస్పాండెంట్ ఓరుగంటి బాబు ఆధ్వర్యంలో పాఠశాల వ్యవస్థాపకుడు మామిడిపెల్లి లచ్చయ్య ఉద్యోగులను సన్మానించారు.

ఇళ్ల మధ్య.. ఇబ్బందికరంగా..

- రాయికల్ మున్సిపల్‌లో పలుచోట్ల ఖాళీ స్థలాలు
- దోమలు, విష పురుగులకు ఆవాసంగా మారుతున్న వైనం
- అవస్థలు పడుతున్న స్థానికులు


రాయికల్ పట్టణంలోని ఖాళీ స్థలంలో పెరిగిన పిచ్చిమొక్కలు

రాయికల్: రాయికల్ పట్టణంలోని నివాసాల మధ్య ఖాళీ స్థలాలు స్థానికులకు ఇబ్బందులు తెచ్చిపెడుతున్నాయి. మున్సిపల్ రోజురోజుకు విస్తరిస్తుండటంతో భవిష్యత్ అవసరాల దృష్ట్యా సమీప ప్రాంతాలు, మండలంలోని వివిధ ప్రాంతాలకు చెందిన వారు పట్టణంలో స్థలాలు కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. దీంతో కొనుగోలు చేసిన స్థలాల్లో ఎలాంటి నిర్మాణాలు చేపట్టకుండా ఖాళీగా వదిలివేస్తున్నారు. దీంతో పిచ్చిమొక్కలు తీవ్రంగా పెరగడంతో పాటు ఆ ప్రాంతాల్లో వ్యర్థాలు వేయడంతో వర్షాలు కురిసినప్పుడు దోమల బెడద తీవ్రంగా పెరుగుతోంది. అంతేకాకుండా విష సర్పాలకు ఆవాసాలుగా మారుతున్నాయి. మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ఇంటింటికీ చెత్త సేకరిస్తున్నప్పటికీ ఖాళీ స్థలాల్లో మాత్రం చెత్త నిల్వలు దర్శనమిస్తున్నాయి. స్థలాల యజమానులు అందుబాటులో లేకపోవడంతో చర్యలు చేపట్టే మార్గం కన్పించడం లేదని మున్సిపల్ అధికారులు తల పట్టుకుంటున్నారు.

ఆయా ఏరియాల్లో..

రాయికల్ మున్సిపాలిటీలోని నాగారంవాడ, శివాజీ ఏరియా, ప్రభుత్వ ఆస్పత్రి ఏరియా, హేమా థియేటర్, బస్టాండ్ ఏరియా, భీమన్నవాడల్లో ఎక్కువ శాతం ఖాళీ స్థలాలు దర్శనమిస్తున్నాయి. ఈ ప్రాంతాల్లో ఖాళీ స్థలాలకు డిమాండ్ ఎక్కువగా ఉండటంతో కొనుగోలు చేసిన యజమానులు ఇంటి నిర్మాణం చేపట్టేందుకు భయపడాల్సిన పరిస్థితి నెలకొంది. అంతేకాకుండా ఖాళీ స్థలాలకు ఎక్కువ రేటు వస్తే అమ్మేందుకు ఆసక్తి చూపుతున్నారు. దీంతో పిచ్చిమొక్కలు ఎక్కువగా పెరగడంతో దోమల బెడదతో మలేరియా, డెంగీ వంటి వ్యాధులు సోకుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రాయికల్ మున్సిపల్‌లో..

వార్డులు	12
జనాభా	19,500
గృహాలు	4,680
గుర్తించిన ఖాళీ స్థలాలు	150 (దాదాపు)

దోమల బెడద తీవ్రంగా ఉంది



ఖాళీ స్థలాల్లో ఎక్కువగా పిచ్చిమొక్కలు పెరగడం, నీరు నిల్వ ఉండటంతో దోమల బెడద తీవ్రంగా ఉంది. దీంతో మలేరియా, డెంగీ వంటి వ్యాధులు సోకుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఖాళీ స్థలాల్లో పిచ్చిమొక్కలను తొలగించి బ్లీచింగ్ పౌడర్ చల్లేలా చర్యలు చేపట్టాలి.

– చెరుకు మహేశ్వరశర్మ, ప్రభుత్వ ఉపాధ్యాయుడు

నోటీసులు అందజేస్తున్నాం



మున్సిపల్ పరిధిలోని ఖాళీ స్థలాలను గుర్తించి శుభ్రంగా ఉంచుకునేలా చూసుకోవాలని యజమానులకు ఆదేశాలు జారీ చేశాం. ఈ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన యజమానులకు నోటీసులు సైతం అందజేశాం. ఎక్కువగా నీరు నిల్వ ఉంటే జేసీబీతో తొలగిస్తున్నాం.

– సంతోష్‌కుమార్, మున్సిపల్ కమిషనర్

మరోసారి ఆశీర్వదించండి

- ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్

సారంగాపూర్: అసెంబ్లీకి మరోసారి ఆశీర్వదించి పంపాలని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో గ్రంథాలయ భవనంతోపాటు మరికొన్ని అభివృద్ధి పనులను ప్రారంభించి మాట్లాడారు. ఐదేళ్ల కాలంలో సీఎం కేసీఆర్ సహకారంతో లెక్కలేనన్ని అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేసినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ చంద్రశేఖర్‌గౌడ్, ఎంపీపీ కోల జమున, జెడ్పీటీసీ మేడిపల్లి మనోహర్‌రెడ్డి, సర్పంచ్ గుర్రాల రాజేందర్ రెడ్డి, వైస్ ఎంపీపీ సొల్లు సురేందర్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.


గ్రంథాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ తదితరులు

మండల కేంద్రంలోనే కార్యాలయాలు నిర్మించాలి


ఎంపీడీవో కార్యాలయం వద్ద బుగ్గారం గ్రామస్తులు

- పార్టీలకతీతంగా ఒక్కటైన బుగ్గారం వాసులు
- ప్రజాప్రతినిధుల తీరుపై ఆగ్రహం

బుగ్గారం: మండల కేంద్రంలోనే ప్రభుత్వ కార్యాలయాలు నిర్మించాలని సోమవారం బుగ్గారం వాసులు ప్రత్యేకంగా సమావేశమై ప్రజాప్రతనిధుల తీరుపై అసహనం వ్యక్తం చేశారు. మండల కేంద్రంలో స్థలం అందుబాటులో ఉన్నా స్థానిక జెడ్పీటీసీ రాజేందర్ సూచనల మేరకు ఊరికి దూరంగా భవనాలు నిర్మించేందుకు శిలాఫలకాలు ఆవిష్కరించడం సరికాదన్నారు. గ్రామస్తులను పాలకులు దగా చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బుగ్గారంలో ఆదివారం జరిగిన శంకుస్థాపనలకు సంబంధించి తమకు ఎలాంటి సమాచారం లేదని వాపోయారు. బుగ్గారంలో నెలకొన్న పరిస్థితులపై గ్రామసభ నిర్వహించాలని తాము కార్యదర్శి నరేందర్‌ను కోరగా వినతిపత్రం తీసుకోవడానికి నిరాకరించారని ఆరోపించారు. దీంతో ఎంపీడీవో కార్యాలయంలో వినతిపత్రం అందించామని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకుడు దసర్తి పూర్ణచందర్, బుగ్గారం గ్రామాభివృద్ధి కోర్ కమిటీ చైర్మన్ చుక్క గంగారెడ్డి, మాజీ సర్పంచ్‌లు మసర్తి రాజిరెడ్డి, కేతి లచ్చయ్య, రామాగౌడ్, రాగన్న, పొలంపెల్లి మల్లేశం, సుంకం ప్రశాంత్, సిగిరి అంజన్న, యువజన సంఘాలు, కుల సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సాదాసీదాగా మున్సిపల్ సాధారణ సమావేశం


మాట్లాడుతున్న గోలి శ్రీనివాస్

జగిత్యాల: పట్టణాభివృద్ధే ధ్యేయమని మున్సిపల్ చైర్మన్ గోలి శ్రీనివాస్ అన్నారు. సోమవారం బల్దియా కార్యాలయంలో కౌన్సిల్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జగిత్యాలలో గతంలో కంటే 100 రెట్ల అభివృద్ధి చెందిందన్నారు. పార్కులు, సెంట్రల్ లైటింగ్‌కు పట్టణ ప్రగతి కింద రూ.20 లక్షలు కేటాయించడం జరిగిందన్నారు. మొత్తం 16 ఎజెండా అంశాలకు సంబంధించి కౌన్సిల్ ఆమోదం తెలిపింది. కొందరు కౌన్సిలర్లు ప్రతిపక్ష కౌన్సిలర్లు పట్టణంలోని సమస్యలను దృష్టికి తీసుకురాగా, సమస్యలను పరిష్కరించేలా చూస్తామని వారికి హామీ ఇచ్చారు. కమిషనర్ అనిల్‌బాబు, డీఈ రాజేశ్వర్, టీపీఎస్ తేజస్విని, అనిల్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

'ఎజెండా అంశాలపై చర్చించలేదు'

మున్సిపల్‌లో సాధారణ సమావేశంలో ఎజెండా అంశాలపై చర్చించలేదని 35వ వార్డు కౌన్సిలర్ జయశ్రీ ఆరోపించారు. ఎలక్షన్ కోడ్ వచ్చిందని, అర్ధంతరంగా ముగించారని, దశాబ్ది ఉత్సవాల బిల్లులపై చర్చించాల్సిన అవసరం ఉండగా, ఎజెండా అంశాలను పాస్ చేసుకున్నారని ఈ విషయమై కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు ఆమె పేర్కొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం.. శంకుస్థాపన


ఆస్పత్రి ప్రారంభోత్సవంలో ఎంపీపీ, తదితరులు

మల్యాల: మండలంలోని సోమవారం ఎంపీపీ మిట్టపల్లి విమల ఆధ్వర్యంలో సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు మిట్టపల్లి సుదర్శన్, ప్రజాప్రతినిధులు పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనం, పాక్స్ భవనం, మ్యాడంపల్లి, రామన్నపేటలో నూతన గ్రామ పంచాయతీ భవనాలను ప్రారంభించారు. తాటిపల్లిలో శాలివాహన సంఘ భవనం, లంబాడీపల్లిలో మున్నూరుకాపు సంఘ భవనం, మహిళా సంఘ భవనం, తక్కళ్లపల్లిలో ముదిరాజ్ సంఘ భవనం, నూకపల్లిలో వంతెన నిర్మాణానికి భూమి పూజ చేశారు. కార్యక్రమంలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి పుప్పాల శ్రీధర్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు జనగం శ్రీనివాస్, సర్పంచులు రౌతు గంగామహేశ్వరి రవివర్మ, గడ్డం జల మల్లారెడ్డి, మారంపల్లి సరోజన గంగాధర్, రైతు బంధు సమితి అధ్యక్షుడు అల్లూరి రాజేశ్వర్‌రెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ ఆసం శివకుమార్, ఉప సర్పంచ్ పోతరాజు శ్రీనివాస్ తదతరులు పాల్గొన్నారు.

స్పోర్ట్స్ కిట్స్ పంపిణీ

ఇబ్రహీంపట్నం/రాయికల్/మల్లాపూర్: ఇబ్రహీంపట్నం మండలకేంద్రంలో సోమవారం సర్పంచ్ నేమూరి లత యువకులకు సీఎం స్పోర్ట్స్ కిట్లు పంపిణీ చేశారు. రాయికల్ మండలం ధర్మాజీపేటలో ఎంపీపీ లావుడ్య సంధ్యారాణి స్పోర్ట్స్ కిట్లు పంపిణీ చేశారు. సర్పంచ్ మారంపల్లి స్నేహ, పాలకుర్తి వెంకటేశ్‌గౌడ్ పాల్గొన్నారు. మల్లాపూర్ మండలం రేగుంటలో సర్పంచ్ కుందేళ్ల నర్సయ్య ఆల్ యూత్ అసోసియేషన్, స్పోర్ట్స్ క్లబ్ సభ్యులకు స్పోర్ట్స్ కిట్స్ అందజేశారు. ఉపసర్పంచ్ మల్లారెడ్డి పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

బాధిత కుటుంబాలకు పరామర్శ

కోరుట్లరూరల్: మండలంలోని జోగిన్‌పల్లి గ్రామానికి చెందిన తలారి రాజేశం ఇటీవల మృతిచెందాడు. బాధిత కుటుంబ సభ్యులను సోమవారం బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ పరామర్శించి రూ.పదివేల ఆర్థికసాయం అందించారు. సర్పంచ్ దుంపాల నర్సు–రాజనర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళిపై అవగాహన

రాయికల్: ఎన్నికల నియమ నిబంధనలపై సోమవారం మున్సిపల్ కార్యాలయంలో సిబ్బందికి కమిషనర్ సంతోష్‌కుమార్ అవగాహన కల్పించారు.

భూమిపూజ

రాయికల్: మండలంలోని తాట్లవాయి గ్రామంలో బద్దిపోశమ్మ ఆలయం వద్ద ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ నిధుల నుంచి బోరు మంజూరు చేయగా సోమవారం ఎంపీపీ లావుడ్య సంధ్యారాణి భూమిపూజ చేశారు.

పరామర్శ

మల్లాపూర్: మల్లాపూర్‌లో వివిధ కారాణాలతో గాయపడిన, చనిపోయిన వారి కుటుంబాలను బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు సురభి నవీన్‌కుమార్ సోమవారం పరామర్శించారు. అనంతరం పార్టీ కార్యాలయంలో కార్యకర్తలతో సమావేశమయ్యారు. కుటుంబ పాలనలో బందీ అయిన రాష్ట్రాన్ని విముక్తి చేయడానికే కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి నేతృత్వంలో ప్రజలను చైతన్యవంతం చేస్తున్నామన్నారు.

పారిశుధ్యంపై దృష్టిసారించాలి

కథలాపూర్: మండలంలోని గ్రామాల్లో పారిశుధ్య పనులపై సర్పంచులు, కార్యదర్శులు దృష్టిసారించాలని ఎంపీడీవో జనార్దన్ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని ఇప్పపెల్లి, పోతారం, తాండ్రియాల గ్రామాల్లో పర్యటించారు.

'అభివృద్ధిని అడ్డుకుంటున్నారు'

రాయికల్: పట్టణంలోని 8వ వార్డు కౌన్సిలర్ కల్లెడ సునీత సోమవారం తన వార్డులో 30 ట్రిప్పుల మట్టిని సొంత డబ్బుతో పోయించి చదును చేయించినట్లు తెలిపారు. నాలుగేళ్ల నుంచి వార్డు అభివృద్ధిలో నిధుల విషయంలో మున్సిపల్ చైర్మన్ కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు.

జాతీయ జెండాలతో సంబరాలు

మల్లాపూర్: ఏషియన్ గేమ్స్‌లో మన దేశం చరిత్ర సృష్టించిందని సర్పంచ్ కడకుంట్ల సాయికుమార్, ఎంపీటీసీ మైస లక్ష్మి అన్నారు. సోమవారం మండలంలోని చిట్టాపూర్‌లో ప్రజాప్రతినిధులు, నాయకులు, యువకులు జాతీయ పతకాన్ని ప్రదర్శిస్తూ ర్యాలీ చేపట్టారు.

బీజేపీ నాయకుల మట్టి సేకరణ

మెట్‌పల్లి: మెట్‌పల్లి పట్టణంలోని పలు వార్డుల్లో సోమవారం బీజేపీ నేతలు ఇంటింటికి వెళ్లి మట్టి సేకరించారు. సదాశివ్, ప్రభాకర్, సునీత, రఘు, కృష్ణమాచారి, సత్యనారాయణ పాల్గొన్నారు.

దళితబంధు ఎంత మందికిచ్చారు?

సారంగాపూర్: దళితబంధు పథకం ఎంత మందికి అందిచారో చెప్పాలని ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ జిల్లా కో కన్వీనర్ బెజ్జంకి సతీశ్‌మాదిగ ప్రశ్నించారు. సోమవారం మండల కేంద్రంలో మాట్లాడారు. ప్రతీ దళిత కుటుంబానికి ఈ పథకం వర్తింపజేసేవరకు ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ దళితుల కాలనీల్లో ప్రచారం చేయొద్దని డిమాండ్ చేశారు.

బీజేపీ నాయకుల ఆందోళన

ధర్మపురి: దళితబంధు, గృహలక్ష్మి, బీసీబంధు ఎంపికలో అవకతవకలు జరగాయని, లబ్ధిదారులను తిరిగి ఎంపిక చేయాలని బీజేపీ నాయకులు డిమాండు చేశారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టి డీటీకి వినతిపత్రం సమర్పించారు. పిల్లి శ్రీనివాస్, తదితరులున్నారు.

కోరుట్లలో గ్రంథాలయ భవనం ప్రారంభం


ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్ లావణ్య

కోరుట్ల: పట్టణంలో నూతనంగా నిర్మించిన గ్రంథాలయ భవనాన్ని సోమవారం మున్సిపల్ చైర్‌పర్సన్ అన్నం లావణ్య ప్రారంభించారు. మున్సిపల్ నిధులతో భవనం నిర్మించినట్లు తెలిపారు. అలాగే పట్టణంలోని జూనియర్ కళాశాల మైదానంలో వాలీబాల్ కోర్టులో నూతనంగా ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లను చైర్‌పర్సన్ ప్రారంభించారు. కార్యక్రమాల్లో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కల్వకుంట్ల సంజయ్, మున్సిపల్ వైస్ చైర్మన్ గడ్డమీది పవన్, రైతు బంధు సమితి జిల్లా అధ్యక్షుడు వెంకట్రావు, కౌన్సిలర్లు పెంగెం గణేశ్, జిందం లక్ష్మీనారాయణ, గ్రంథాలయ డైరెక్టర్ పుప్పాల ఉమాదేవి, వాలీబాల్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు అబ్దుల్ మజీద్, అధ్యక్షుడు గుంటుక విజయ్ తదితరులు పాల్గొన్నారు.

మేడిపల్లిలో ఇంటింటా కాంగ్రెస్ ప్రచారం


పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఆది శ్రీనివాస్

మేడిపల్లి: మండల కేంద్రంలో సోమవారం ఆది శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా మండల కేంద్రానికి చెందిన మ్యదరి లాజర్ 50 మంది యువకులతో కాంగ్రెస్‌లో చేరారు. నరేశ్‌రెడ్డి, రమేశ్ రెడ్డి, శ్రీపతి దామోదర్, ప్రశాంత్, వినయ్, మహేశ్ రెడ్డి, స్వామిగౌడ్, లక్ష్మణ్, మల్లేశం, కొమురయ్య, జీవన్ తదితరులు పాల్గొన్నారు.

సమాచారం..

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

జగిత్యాలరూరల్/మల్యాల: 33/11 కేవీ మల్యాల ఫీడర్‌లైన్‌లో మంగళవారం మరమ్మతుల దృష్ట్యా ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏడీఈ బాలలింగం తెలిపారు. టీఆర్‌నగర్ సబ్‌స్టేషన్ పరిధిలోని ధరూర్, టీఆర్‌నగర్, నర్సింగాపూర్, వంజరిపల్లి, మల్యాల మండలం పోతారం, రాజారం గ్రామాల సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

హౌసింగ్‌బోర్డు సబ్‌స్టేషన్‌లో..

జిల్లా కేంద్రంలోని హౌసింగ్‌బోర్డు 33/11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో మంగళవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ మరమ్మతులు నిర్వహించనున్నట్లు టౌన్–3 ఏఏఈ రహీం తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని వాణీనగర్, తులసీనగర్, బీట్‌బజార్, గీత విద్యాలయం, నటరాజ్ చౌరస్తా, బసవేశ్వర కూడలి, ఇస్లాంపుర, నిజామాబాద్‌రోడ్, పురాణిపేటలో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

తహసీల్దార్‌కు ఫిర్యాదు


ఫిర్యాదు అందజేస్తున్న నాయకులు

రాయికల్: ప్రభుత్వం మంజూరు చేసిన కుట్టుమిషన్లను బీఆర్‌ఎస్ నాయకుల బంధువులకే అందజేశారని, అర్హులకు ఇవ్వలేదని ఆరోపిస్తూ సోమవారం పట్టణానికి చెందిన మైనార్టీలు తహసీల్దార్ ఖయ్యూంకు ఫిర్యాదు చేశారు. మైనార్టీ నాయకులు సోయబ్, ఖాజా, జాకీర్ పాల్గొన్నారు.

విత్తనాల పంపిణీ

మల్యాల: మండలంలోని తాటిపల్లి గ్రామంలో ఫాతిమానగర్ అడోరేషన్ సొసైటీ ఆధ్వర్యంలో సోమవారం 115మంది రైతులకు ఉచితంగా కూరగాయల విత్తనాలు పంపిణీ చేశారు. ప్రాజెక్టు డైరెక్టర్ ప్రీతా, మండల వ్యవసాయ అధికారి చంద్రదీపక్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అండగా ప్రభుత్వం

ఇబ్రహీంపట్నం: రైతులకు అండగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఉందని జెడ్పీటీసీ భారతి అన్నారు. మండలకేంద్రంలోని నిర్మించిన ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘ భవనం, షాపింగ్ కాంప్లెక్స్‌ను సోమవారం ప్రారంభించి మాట్లాడారు. సర్పంచు నేమూరి లత, సింగిల్‌విండో చైర్మన్ బద్దం గోపి, వైస్ చైర్మన్ జిల్లాల పవన్, తదితరులు పాల్గొన్నారు.

మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలి


వినతిపత్రం ఇస్తున్న కాంగ్రెస్ నాయకులు

మెట్‌పల్లి: మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని మెట్‌పల్లి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అల్లూరి మహేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో రైతులు దళారులకు తక్కువ రేటుకు అమ్ముకొని నష్టపోతున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు లింగారెడ్డి, అంజిరెడ్డి, సంతోష్‌రెడ్డి, క్రాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు.

మార్క్‌ఫెడ్ ద్వారా కొనాలి

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నంలో మార్క్‌ఫెడ్ ద్వారా మక్కల కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని సింగిల్‌విండో మాజీ చైర్మన్ అబ్బటి రాజరెడ్డి కోరారు. ఆయన వెంట రైతులు ఐలాపూరం భూమరెడ్డి, బదనకుర్తి భూమన్న ఉన్నారు.

హామీలకే పరిమితమైన పాలకులు


మాట్లాడుతున్న నిషాంత్ కార్తికేయ

మల్లాపూర్: కనక సోమేశ్వర కొండ ఘాట్ రోడ్డు ఎప్పుడు పూర్తి చేస్తారని బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి పూదరి నిషాంత్ కార్తికేయ ప్రశ్నించారు. సోమవారం సోమేశ్వర కొండను సందర్శించి మాట్లాడారు. స్థానిక ఎమ్మెల్యే సోమేశ్వర కొండపైకి ఘాట్ రోడ్డు నిర్మిస్తా అంటూ హామీ ఇచ్చి ఇప్పటికీ నెరవేరలేదన్నారు. ఎంపీ అరవింద్ సోమేశ్వర కొండను పర్యాటక కేంద్రంగా మార్చేందుకు నిధులు మంజూరు చేయిస్తానని పత్తాలేకుండా పోయారని విమర్శించారు. తక్షణమే పనులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. అనంతరం మధ్యాహ్న భోజన కార్మికుల సమ్మెకు సంఘీభావం ప్రకటించారు. ఆయన వెంట బీఎస్పీ నాయకులు ఉన్నారు.

12వ రోజుకు సమ్మె

రాయికల్: సమస్యలు పరిష్కరించాలని మధ్యాహ్న భోజన కార్మికులు రాయికల్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట చేపడుతున్న సమ్మె సోమవారం 12వ రోజుకు చేరింది. చిలువేరి లక్ష్మి, లావుడ్య నీలాబాయి, శంకరమ్మ, పద్మ, మ్యాకల శారద, గంగమణి పాల్గొన్నారు.

కార్పొరేట్ ఉద్యోగాలు సాధించాలి


విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన

జగిత్యాల: విద్యార్థులు కార్పొరేట్‌స్థాయిలో ఉద్యోగాలు సాధించాలని రామకృష్ణ విద్యాసంస్థల చైర్మన్ రామకృష్ణ అన్నారు. సోమవారం కళాశాలలో ఫ్రెషర్స్‌డే వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కామర్స్, మేనేజ్‌మెంట్ విద్యార్థులకు అనేక ఉద్యోగ అవకాశాలున్నాయని పేర్కొన్నారు. యువత చెడు అలవాట్లకు బానిస కాకుండా ఉన్నతమైన భవిష్యత్ వైపు వెళ్లాలన్నారు. ఈసందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ప్రిన్సిపాల్ మునీందర్‌రెడ్డి, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.